క్లుప్తంగా

బదిలీ అయిన తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వీఆర్‌ఏలు

నాతవరం: బదిలీ అయిన స్థానిక తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల విధుల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా నుంచి నాతవరం మండలానికి బదిలీపై వచ్చిన ఆయన తిరిగి ఆ జిల్లాకు బదిలీపై వెళుతున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం రమేష్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికల విధులను ప్రశాంతంగా నిర్వహించగలిగానని చెప్పారు. ఈకార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ డి.వెంకటేశ్వర్లు, మండల శాఖ మాజీ అధ్యక్షుడు కె.చిన్నబ్బాయి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్వరం రెవెన్యూ సమస్యల పరిష్కారం



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ మురళీమోహన్‌రావు

మాకవరపాలెం: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ మురళీమోహనరావు సిబ్బందికి సూచించారు. వీఆర్వోలతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని, వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకరరావు, వ్యవసాయ అధికారి చిరంజీవి పాల్గొన్నారు.

192 పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు



దిబ్బలపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు నూకేశ్వరరావు

రోలుగుంట: లంపీ స్కిన్ వ్యాధి నివారణకు మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు టీకాలు వేసినట్టు పశువైద్యులు నూకేశ్వరరావు, బాల మౌనిక తెలిపారు. ఎం.కె.పట్నం, కొంతలం, దిబ్బలపాలెం గ్రామాల్లో 192 పశువులకు ఈ టీకాలు వేసినట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలను వారు రైతులకు తెలియజేశారు. వ్యాధి లక్షణాలున్న పశువులకు పది తమలపాకులు, 10 మిరియాలు, కల్లుప్పు కలిపి చూర్ణం చేసి ప్రతి రెండు గంటలకు నోటిద్వారా అందించాలని సూచించారు. ముద్ద కర్పూరం, వేపనూనె కలిపిన మిశ్రమాన్ని బాహ్యాలేపనంగా ముద్ద చర్మ వ్యాధి లక్షణాలున్నచోట పూయాలని తెలిపారు.

ఎంపీడీవో ఆత్మహత్య బాధాకరం



వెంకటరమణారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు ఆత్మహత్య చేసుకోవడం బాధకరమని నాతవరం ఎంపీడీవో జాగరల రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం సిబ్బంది. పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగులు వెంకట రమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



పెద్దేరు జలాశయం



పెద్దేరు ఆయకట్టు పరిధిలో వేస్తున్న వరి నాట్లు



బుచ్చెయ్యపేట మండలం లూలూరులో ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న రైతు

మాడుగుల: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయాలతో పాటు, చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరింది. దీంతో రైతులు ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభించారు. మాడుగుల నియోజకవర్గంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 45 వేల ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 50 వేల ఎకరాల్లో సాగు చేయడానికి అన్నదాతలు సిద్ధమవుతున్నారు. గత నాలుగు రోజులుగా నాట్లు వేస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లో నాట్లు వేశారు. వచ్చేనెల 15వ తేదీలోగా నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండడంతో ఆయకట్టు భూములకు సాగునీటికి ఢోకా ఉండదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో దమ్ములు ప్రారంభం

బుచ్చెయ్యపేట: వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. వారం రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తుండడంతో బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల్లో చెరువులు,వ్యవసాయ బావుల్లో నీరు చేరింది. గెడ్డలు,వాగులు నిండుగా పారుతున్నాయి. పెద్దేరు,తాచేరు,బొడ్డేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సాగు నీరు పుష్కలంగా ఉండడంతో మండల రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. గంటికొర్లాం, పొట్టిదొరపాలెం, నిమ్మలోవ, భట్లోవ, లూలూరు, లోపూడి, శింగవరం, వడ్డాది, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, రాజాం, గున్నెంపూడి తదితర గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లు,టిల్లర్లు,దుక్కుటెద్దుల సాయంతో దమ్ములు చేస్తున్నారు. జూన్ ప్రారంభంలో వేసిన వరి ఆకులు ఏపుగా ఎదిగి నాట్లు వేయడానికి అందివచ్చాయి. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న 35 పంచాయతీల్లో ప్రతి సంవత్సరం 6,800 ఎకరాల్లో వరి నాట్లు వేస్తారు. ఈ ఏడాది కూడా అంతే విస్తీర్ణంలో వరి నాట్లు వేయడానికి రైతులు వరి ఆకులు సిద్ధం చేశారని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. ఇప్పటికే గంటికొర్లాం,నిమ్మలోవ, పొట్టిదొరపాలెం కొండల పక్కనున్న రైతులు వరి ఆకు తీతలు పూర్తి చేసి, నాట్లు వేయడానికి శ్రీకారం చుట్టారు. వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో వరి నాట్లు ప్రారంభమవుతాయని, అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా రైతులకు తగిన సూచనలు,సలహాలు అందిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి తెలిపారు.

4న మోదకొండమ్మ పండగ



మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో వచ్చే నెల 4న మోదకొండమ్మ అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. ఈ మేరకు పండగ చాటింపు ఈ నెల 20న వేశారు. అమ్మవారి ఘటాల ఊరేగింపు 28 వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పండగనాడు గ్రామంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

టెన్త్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థినికి నగదు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ

మాకవరపాలెం: పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మండలంలోని బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. టెన్త్ పరీక్షల ఫలితాల్లో బూరుగుపాలెం ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన ధనిమిరెడ్డి గాయత్రికి రూ.5,000, ద్వితీయ స్థానం సాధించిన మేడపురెడ్డి దుర్గాప్రసాద్‌కు రూ.2,500, తృతీయ స్థానం కైవసం చేసుకున్న గేదె తేజకు రూ.1,000 చొప్పున నగదును బుధవారం సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడపురెడ్డి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి గంగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకికి ఘన నివాళి



వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, జనవిజ్ఞాన వేదిక నాయకులు



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

నర్సీపట్నం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతిని స్థానిక గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకటరమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ అధికారి దమయంతి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయోద్యమం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పాటు నందించిన గొప్ప వ్యక్తి అయ్యంకి వెంకట రమణయ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యంకి గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషిని చేశారన్నారు.

500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యం



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఉపాధి హామీ పథకం నిధులతో మూడేళ్లలో 500 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలన్నది లక్ష్యమని ఎంపీడీవో జాగరల రాంబాబు అన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బందితో తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు మండల వ్యాప్తంగా 250 ఎకరాలకు పైగా పండ్ల తోటలు వేసినట్టు చెప్పారు. మూడేళ్ల పాటు పండ్ల తోటల సంరక్షణకు అయ్యే ఖర్చును ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని చెప్పారు. ఈఏడాది ఉపాధి హామీ పథకంలో ఎనిమిది లక్షల మందికి పైగా కూలీలకు 100 రోజులు పని కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం పంట కాలువలను అభివృద్ధి చేసేందుకు పోడు భూముల్లో రాతిపేర్పు పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, టెక్నికల్ అసిస్టెంటు దేముడు తదితరులు పాల్గొన్నారు.

కేజే పురంలో 108 మందికి వైద్యసేవలు



కేజే పురం సచివాలయంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాదు

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం సచివాలయంలో బుధవారం ప్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాదు 108 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కంఠారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎస్.కంఠారంలో 62 మందికి వైద్య సేవలు

గొలుగొండ: మండలంలోని ఎస్.కంఠారంలో బుధవారం 62 మంది జ్వరపీడితులకు వైద్యసేవలందించారు. గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు యాళ్ల నాయుడు, బిడిజాన మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉద్యోగుల అసోసియేషన్ సభ్యత్వ నమోదు



సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు సభ్యత్వ నమోదు రసీదును అందజేస్తున్న బాబూరావు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యత్వ నమోదును జోరుగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శంకరరావుతో బుధవారం సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఈ నెల 29న కె.కోటపాడు తాలూకా యూనిట్ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

రాయితీ యూరియాను సద్వినియోగం చేసుకోవాలి



దేవరాపల్లిలో రైతులకు యూరియా అందజేస్తున్న ఏవో కాంతమ్మ



గుల్లేపల్లిలో రైతులకు యూరియా అందజేస్తున్న ఏఈవో లైలాదేవి

దేవరాపల్లి: ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో బుధవారం యూరియా పంపిణీని ప్రారంభించారు. కొత్తపెంట, వాకపల్లి, తెనుగుపూడి, ఎం.అలమండ, రైవాడ తదితర తొమ్మిది రైతు భరోసా కేంద్రాల్లో 132.165 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు ఏవో కాంతమ్మ తెలిపారు. కాగా 50 కిలోల యూరియా బస్తాను రాయితీపై రైతుకు రూ. 266.50 అందజేస్తున్నట్టు చెప్పారు. మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ డి.వరుణ్‌కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

రాయితీపై యూరియా పంపిణీ

కె.కోటపాడు : యూరియాను 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్టు మండల వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి తెలిపారు. గుల్లేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు ఆమె బుధవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుల్లేపల్లిలో రైతులకు 12 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. చెరుకు పంటకు ప్రస్తుతం యూరియాను వేయడం వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. వరి సాగు చేసే భూమిలో దమ్ము సమయంలో ఎకరాకు 50 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 20 కిలోల పోటాష్ వేసి కలియదున్నాలని ఆమె రైతులకు సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



దిబ్బిడి హైస్కూల్‌లో తొక్కుడు బిళ్ల ఆడుతున్న విద్యార్థులు



రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో-2 జగ్గారావు



ఎ. కొత్తపల్లిలో ఆటలాడుతున్న విద్యార్థినులు



అష్టాచమ్మా ఆడుతున్న విద్యార్థినులు



పైడిపాలలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు



తొక్కుడుబిళ్ల ఆటను తిలకిస్తున్న ఎంఈవో ప్రసాద్

బుచ్చెయ్యపేట: క్రీడలు, వ్యాయామంతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా తురకలపూడి, దిబ్బిడి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు తొక్కుడుబిల్ల,చెమ్మచెక్క,తాడు లాగు ఆట,కబడ్డీ,తారంగం తదితర సంప్రదాయ ఆటల పోటీలను నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

రోలుగుంట: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన పోటీలను హెచ్‌ఎం ప్రసాద్, ఎంఈవో-2 జగ్గారావు ప్రారంభించారు. పీడీ గోవిందరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

దేవరాపల్లి: విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యతో పాటు క్రీడలపై దృష్టిసారించాలిని, క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి.ఉషారాణి అన్నారు. శిక్షా సప్తాహ వారోత్సవాలలో భాగంగా మూడో రోజు బుధవారం క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సంప్రదాయ ఆటల పోటీలను నిర్వహించారు. తొక్కుడు బిళ్ల, జోడి జోడి, వీరి వీరి గుమ్మడి పండు, కర్రా బిల్ల, ఏడు పెంకులాట, వైకుంఠ పాళి, అష్టాచమ్మ, బెచ్చాట, గోలీలు తదితర సంప్రదాయ ఆటలను ఉపాధ్యాయులు దగ్గరుండి ఆడించారు. సంప్రదాయ క్రీడల చరిత్రను విద్యార్థులకు వివరంగా వివరించారు.

మాకవరపాలెం మండలంలో..

మాకవరపాలెం: శిక్ష సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని తూటిపాల, పైడిపాల, మాకవరపాలెం, కొండలఅగ్రహారంతోపాటు అన్ని పాఠశాలల్లోనూ బుధవారం సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, స్నేహ భావం పెంపొందించేందుకు ఆటల పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో మూర్తి తెలిపారు.

కె.కోటపాడు మండలంలో..

కె.కోటపాడు: చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సంప్రదాయ ఆటల పోటీలను నిర్వహించినట్టు మండల విద్యాశాఖాధికారి డి.వి.డి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగున పడిపోతున్న సంప్రదాయ క్రీడలు ఈ పోటీలతో వెలుగులోనికి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సన్నిబాబు, ఉపాధ్యాయుడు అడిగర్ల సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

కోటవురట్ల : శ్రీ సత్యసాయి యూనివర్సల్ వెల్ఫేర్ గ్రూపు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. కొడవటిపూడిలోని ఎంపీయూపీ స్కూల్లో బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ నిర్వహించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి స్థాయికి ఎదగాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.కృష్ణప్రసాద్, ఎంపీటీసీ యలమంచి ప్రకాష్, సర్పంచ్ కోసూరు అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధి శెట్టి విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సుధారాణి

గొలుగొండ: కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేస్తున్నారని, వాటిని పొందగోరే వారు వీఆర్వోలను సంప్రదించి ఆన్‌లైన్ చేసుకోవాలని ఏవో సుధారాణి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కౌలు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణ అర్హత కార్డులు పొందే కౌలు రైతులు తప్పని సరిగా భూమి సొంతదారులైన రైతుల నుంచి పాస్‌పుస్తకం జెరాక్సు, ఆధార్‌కార్డులు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్డులు పొందిన కౌలు రైతులకు రుణాలు, విత్తనాలు, పంటనష్టం, పంట కొనుగోలు వంటి అర్హతలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌భరత్, వీఆర్‌వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తక్షణం పెట్టుబడి సాయం అందించాలి



లోపూడి సచివాలయం వద్ద వినతి పత్రం అందజేస్తున్న సాంబశివరావు,నాయుడు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం తక్షణం రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సాంబ శివరావు,ఎస్.వి.నాయుడు డిమాండ్ చేశారు. రైతులు,కూలీలు,కౌలు రైతులతో వీరు లోపూడి సచివాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన, కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా నేటికీ రైతులకు ఇస్తామన్న రూ.20 వేల పెట్టుబడి సాయం అందించలేదని, దీనివల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే జీవో 22 ను రద్దు చేయాలని, భూమి సొంతదారుడైన రైతు సంతకం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి,బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని, 200 రోజుల ఉపాధి కూలీ పని దినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.